www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 7 జులై 2025 | 5 | ఏలూరు



నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా ప్రజల దృష్టికి మరింత చేరువ చేయడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) సేవలను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిల్లో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఆదేవిధంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల ఏడో తేదీ సోమవారం యథావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను సమీప మండల, డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో నేరుగా సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం అధికారిక వెబ్‌సైట్ https://meekosam.ap.gov.in ఏర్పాటు చేసిందని తెలిపారు. ఫిర్యాదు నమోదు, ఫిర్యాదుల స్థితి తదితర సమాచారం తెలుసుకోవాలంటే 1100 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయవచ్చని పేర్కొన్నారు.

కూలి డబ్బులు ఇవ్వండి మహాప్రభో..!

ఉపాధి హామీ శ్రామికులకు సొమ్ములు అందని పరిస్థితి

ఏడు వారాలకు పైగా బకాయిలందక విలవిల

రెండు జిల్లాల్లో రూ. వంద కోట్లు పైనే కూలి సొమ్ములు పెండింగ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతో పేదల పాట్లు వర్ణనాతీతం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉపాధి హామీలో పని చేసిన శ్రామికులకు కూలి డబ్బులు ఇవ్వకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ప్రతి రోజూ రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు సకాలంలో కూలి డబ్బులు అందక ఆర్థికంగా నలిగిపోతున్నాయి. ఏడు వారాలకుపైగా సొమ్ములు అందకపోవడంతో శ్రామికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూలి సొమ్ములు ఇవ్వకపోతే ఇల్లు ఎలా గడపాలంటూ శ్రామికులు ప్రశ్నిస్తున్న పరిస్థితి నెలకొంది. చేసిన పనులకు ఎప్పటికప్పుడు డ్వామా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపిస్తున్నా సొమ్ములు విడుదలలో మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నాయి. జూన్ మొదటి వారంలో కేంద్రం నుంచి రూ.550 కోట్ల వరకూ విడుదలయ్యాయని, అందరికీ సొమ్ములు జమవుతాయని తెలిపారు. రెండు వారాల సొమ్ము మాత్రమే జమైన పరిస్థితి నెలకొంది. కేంద్రం నిధులు విడుదల చేస్తే రాష్ట్రం ఇవ్వలేదా.. లేక కేంద్రమే విడుదల చేయలేదా అనే విషయంపై స్పష్టత లేకుండా పోయింది. ఏలూరు జిల్లాలో 4.85 లక్షల వరకూ జాబ్‌కార్డ్ దారులు పనిచేస్తున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూన్ ఒకటో తేదీ వరకూ 55 లక్షల వరకూ పని దినాలు చూపారు. తర్వాత గడిచిన 37 రోజులుగా ఉపాధి శ్రామికులు పనిచేస్తూనే ఉన్నారు. జూన్ ఒకటోతేదీకి ఉపాధి శ్రామికులకు వేతనాల కింద రూ.124 కోట్ల వరకూ రావాల్సి ఉంది. పశ్చిమలో జూన్ ఒకటో తేదీకి 16 లక్షల పని దినాలు కల్పించగా రూ.45 కోట్ల వరకూ ఉపాధి శ్రామికులకు కూలి సొమ్ములు అందాల్సి ఉంది. అక్కడ సైతం ఈ కాలంలో పనులు చేస్తూనే ఉన్నారు. ఏప్రిల్ నుంచి జులై మొదటి వారం వరకూ పనిచేసిన రోజుల్లో కేవలం రెండు వారాల సొమ్ములు మాత్రమే జమైనట్లు ఉపాధి శ్రామికులు చెబుతున్నారు. ఆ ప్రకారం చూస్తే ఇంకా రెండు జిల్లాల్లో ఉపాధి కూలి సొమ్ములు రూ.వంద కోట్లకుపైగా బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. కూలి సొమ్ములు ఎప్పటికిస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కూలి సొమ్ముల కోసం ఉపాధి శ్రామికులు కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం సరైన సమాధానం లేకుండా పోయింది.

ఇల్లు గడిచేదెలా..

నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వంట నూనె ప్యాకెట్ సైతం రూ.150 పైనే పలుకుతోంది. పప్పుల ధరలు కిలో రూ.వందకుపైగానే ఉన్నాయి. దీంతో సామాన్య ప్రజానీకం బతుకు కష్టతరంగా మారింది. ఉపాధి హామీలో జాబ్‌కార్డులున్న శ్రామికుల్లో అత్యధికం కూలి సొమ్ములతోనే జీవనం సాగించే పరిస్థితి ఉంది. వారం సొమ్ములు అందింతే ఇంట్లోకి కావాల్సిన సరులకు తెచ్చుకుంటారు. కూలి సొమ్ములు నెలల తరబడి పెండింగ్ పెడితే ఏవిధంగా బతకాలంటూ ఉపాధి శ్రామికులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇలా అయితే పని చేయడం ఎందుకంటూ ప్రశ్నిస్తున్నారు. కష్టకాలంలో అండగా ఉండడానికి ఉపాధి హామీ చట్టం తెచ్చారు. పనులు లేని రోజుల్లో ఉపాధి పనులు కల్పిస్తున్నారు. అటువంటప్పుడు చేసిన పనికి సొమ్ములు ఇవ్వకపోతే ఆయా కుటుంబాలు ఏవిధంగా బతకాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పాల్సి ఉంది. ఉపాధి హామీ కూలి సొమ్ములు వెంటనే విడుదల చేయాలని ఉపాధి శ్రామికులంతా కోరుతున్నారు. నిధులు కేంద్రం ఇచ్చిందా.. లేదా అనేది రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలి. ఒకవేళ కేంద్రం నుంచి నిధులు వస్తే రాష్ట్రం ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదో సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. పాలకులు మారుతున్నా ఉపాధి శ్రామికుల బతులకు మాత్రం మారడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తగ్గిన గోదావరి వరద

ప్రజాశక్తి - పోలవరం

ఎగువ రాష్ట్రాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోదావరి ఉపనదుల జలాలు గోదావరిలో కలుస్తుండడంతో గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరుగుతోంది. ఆదివారం పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి చేరుకున్న 2,23,309 క్యూసెక్కుల అదనపు నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 28.220 మీటర్లు, దిగువన 18.740 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్‌కు ఎగువన 28.370 మీటర్లు, దిగువ కాపర్ డ్యాంకు దిగువన 17.770 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్ మధ్య 15.680 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్టు దిగువన 6.66 మీటర్లు నమోదైందని, ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం తగ్గుతూ వస్తోందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

కుక్కునూరు రూరల్: వర్షాల కారణంగా గోదావరికి వరద క్రమంగా పెరుగుతోంది. దీంతో ముంపు మండలాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. వారం రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాజెక్టులు నిండి, సామర్థ్యానికి మించి నీటిని దిగువకు విడుదల చేయడంతో గోదావరిలో వరద నీరు చేరుతోంది. శనివారం 18.3 అడుగులుగా ఉన్న వరద స్థాయి ఆదివారం నాటికి 19.6 అడుగులకు చేరుకుంది. ఈ పెరుగుదలతో ముంపు మండలాల ప్రజలు తీవ్ర భయాందోళనలో ఉన్నారుట.

వేలేరుపాడు రూరల్ : ఏటా జులై ప్రారంభమైందంటే గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజల గుండెల్లో భయానక వాతావరణం నెలకొంటుంది. ఆదివారం భద్రాచలం వద్ద 19.6 అడుగుల మేర నీరు నిలకడగా ఉంది. అయినా కురుస్తున్న వర్షాలతో గోదావరిలోకి వరద నీరు చేరి క్రమేపీ పెరుగుతుండడంతో పరివాహక ప్రజలు ఆందోళన చెందుతుఆన్నరు. గోదావరికి వరదలొస్తే రహదారులు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని, ముందు జాగ్రత్తగా నిర్వాసితులు చల్లావారిగూడెం పునరావాస కేంద్రాలకు, అలాగే భూములు ఉండి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందని నిర్వాసితులు మేరక ప్రాంత గ్రామాల్లోని ఇళ్లకు అద్దె వెళ్లిపోతున్నారు. ఈ సంవత్సరమైనా ప్రభుత్వం స్పందించి కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకుని పరిహారం ఇచ్చి పునరావాస కాలనీలకు తరలించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

పేదలకు భూములివ్వకపోడం సిగ్గుచేటు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



భూముల్లో విత్తనాలు వేసి మాట్లాడుతున్న బలరాం

2013 భూ సేకరణ చట్ట ప్రకారం పేదల భూములు పేదలకు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆగిరిపల్లి భూ పోరాటాన్ని సందర్శించి పేదలు సాగుకు సిద్ధం చేసిన భూముల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు ఆధ్వర్యంలో కందులు, చిక్కుడు గింజలు వేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న భూ పోరాటంలో భాగంగా ఆగిరిపల్లి నుంచి భూముల్లోకి పాదయాత్ర చేసి భూముల్లో దుక్కి దున్ని, చదును చేసి, భూముల్లో అపరాల పంటలు వేశారు. ఈ సందర్భంగా బి.బలరాం మాట్లాడుతూ పేదలు 20 ఏళ్ల నుంచి సాగు చేస్తున్న భూములకు నేటికీ పట్టాలు ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఓ పక్క ఫ్రీ హోల్డ్ భూములని చెబుతూ ఆ భూములను భూస్వాములు కట్టబెట్టే విధంగా వ్యవహరించడంతోపాటు పేదల సాగులో ఉన్న అసైన్డ్, సీలింగ్, హెచ్ఒ ల్యాండ్స్ వంటి వాటిపై భూస్వాముల కన్ను పడిందన్నారు. చిన ఆగిరిపల్లి గ్రామ పేదలు, దళితులు గత కొంత కాలంగా ఈ భూముల్లో అపరాలు సాగు చేస్తున్నా అధికారుల కళ్లకు కనపడడం లేదా అని ప్రశ్నించారు. 20 ఏళ్ల నుంచి సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వకపోగా ఈ భూములను భూస్వాములకు కట్టబెట్టే విధంగా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పేదల భూములను ప్రయివేటు కంపెనీలకు కట్టబెట్టే విధంగా వ్యవహరిస్తున్నాయని తెలిసిందన్నారు. ఈ భూములను పేదల సాగుకు ఇస్తే వాళ్ల సొంత కాళ్లపై నిలబడి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పెంచే విధంగా ఉంటుందని తెలిపారు. ఈ పేరుతో పేదల చేతుల్లో ఉన్న భూములను భయభ్రాంతులకు గురిచేసి ప్రయివేటు వ్యక్తులకు, కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తే ఎర్రజెండా చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి రవి, వ్యకాస జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటికే ఆగిరిపల్లి మండలంలో వట్టిగుడిపాడు, ఈదులగూడెం తదితర గ్రామాల్లో అటవీ పోరంబోకు భూములు, రిజర్వాయర్ ఫారెస్ట్ భూముల్లో పేదలు సాగు చేస్తున్నారని తెలిపారు. సాగు చేస్తున్న వారికి హక్కు పట్టాలు కల్పించాలని కోరారు. రానున్న కాలంలో పేదలు సాగు చేస్తున్న భూములకు అటవీశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు స్పందించి వారికి న్యాయం చేయాలని, పట్టాల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు నాయకులు జి.రాజు, సీనియర్ నాయకుడు సత్తు కోటేశ్వరరావు నాయకత్వం వహించగా భూ పోరాట నాయకులు అర్జున్‌రావు, రంజిత్, మేరీ కుమారి, కరుణ, నవీన్, మైఖేల్, రంగారావు, సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంపునకు చర్యలు

ఆర్ఐఒ కె.యోహాన్





ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచడంతోపాటు నాణ్యమైన విద్యనందించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు ఏలూరు జిల్లా ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి (ఆర్ఐఒ) కె.యోహాన్ తెలిపారు. జిల్లాలో ఎన్ని జూనియర్ కళాశాలలు ఉన్నాయి, ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తోంది, ఈ సంవత్సరం అడ్మిషన్ల పరిస్థితి ఎలా ఉంది? వంటి ప్రశ్నలకు ప్రజాశక్తి జరిపిన ముఖాముఖిలో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: జిల్లాలో ఏయే యాజమాన్యాల పరిధిలో మొత్తం ఎన్ని జూనియర్ కళాశాలలు ఉన్నాయి?

జిల్లాలో మొత్తం 140 జూనియర్ కళాశాలలు ఉండగా వాటిలో ప్రభుత్వ కళాశాలలు 19 ఉన్నాయి. ఎయిడెడ్ కళాశాల ఒకటి, సాంఘిక సంక్షేమ కళాశాలలు 6, గిరిజన సంక్షేమ కళాశాలలు 3, కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలు 3, మోడల్ స్కూళ్లు 26, ప్రయివేటు కళాశాలలు 82 ఉన్నాయి.

ప్రశ్న: ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ఎప్పుడు ప్రారంభమయ్యాయి? ఈ సంవత్సరం ఎలా ఉన్నాయి?

ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అడ్మిషన్లు జరుగుతున్నాయి. గతేడాది 18,434 అడ్మిషన్లు వస్తే ఈ ఏడాది ఇప్పటికే 17,400 అడ్మిషన్లు పూర్తయ్యాయి. జులై 31వ తేదీ వరకూ సమయం ఉంది. అడ్మిషన్ల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో కలిపితే 36,000 మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్నారు.

ప్రశ్న : ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు అందిస్తోంది?

ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఇప్పటికే ఉచితంగా టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్ అందించాం. పోటీ పరీక్షలకు అవసరమయ్యే మెటీరియల్, సైన్స్ రికార్డులు విద్యార్థులకు అందించాం. కొత్త సిలబస్ ప్రకారం ఇంకొన్ని పుస్తకాలు కూడా ఇస్తాం. గత సంవత్సరం కళాశాల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేశాం. ఈ సంవత్సరం సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుంది.

ప్రశ్న :మార్చిలో జరిగిన ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో మన జిల్లా ఏ స్థానంలో ఉంది, ఉత్తీర్ణతా శాతం ఎంత ?

ఈ మార్చిలో జరిగిన పరీక్షల్లో జిల్లా 11వ స్థానంలో నిలిచింది. 83 శాతం ఉత్తీర్ణత సాధించాం. ఈ సంవత్సరం మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కళాశాల సమయం ఒక గంట పెంచాం. ఫిబ్రవరి నాటికి సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను అన్ని రకాలుగా పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం.

ప్రశ్న: గత ఫలితాలు చూస్తే కేవలం 34 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించడం జరిగింది. మోడల్ స్కూల్స్‌కు ప్లస్ టుకు అడ్మిషన్లు వస్తున్నాయా?

హైస్కూల్‌లోనే ప్లస్ టు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు బోధనంతా స్కూల్ ఎడ్యుకేషన్ పరిధిలోనే జరుగుతోంది. కేవలం పరీక్షలు మాత్రమే మేం నిర్వహిస్తాం. ప్రస్తుతం 26 మోడల్ స్కూళ్లలో 870 మంది విద్యార్థులు ఉన్నారు. దగ్గరలోనే ఇంటర్ కళాశాలలు ఉండడంతో హైస్కూల్ ప్లస్‌లో చేరేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదు.

ప్రశ్న : ఈ నెల 10న నిర్వహించే మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ ఎందుకోసం నిర్వహిస్తున్నారు. అసలు ఆ మీటింగ్ లక్ష్యం ఏంటి?

ఈ నెల 10వ తేదీన పేరెంట్స్‌తో, పూర్వ విద్యార్థులతో, గత సంవత్సరం టాపర్స్, రాజకీయ పార్టీల నాయకులతో అన్ని కళాశాలల్లో మెగా మీటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుంది. అక్కడ పూర్తిస్థాయిలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి దృష్టిలోపం, ఎనిమియా వంటి పిల్లలను గుర్తించి ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటాం. పేరెంట్స్ పూర్వ విద్యార్థుల సలహాలు తీసుకుని విద్యా ప్రమాణాలు పెంచడానికి చర్యలు తీసుకుంటాం. ఇకనుంచి రెగ్యులర్‌గా పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసి విద్యార్థులకు సంబంధించిన ప్రతి విషయం వారితో చర్చిస్తాం.

ప్రశ్న : ప్రయివేటు కళాశాలల్లో ఫీజుల దోపిడీ జరుగుతోందని, విద్యార్థి, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఆరోపిస్తున్నాయి, ఫీజుల నియంత్రణపై ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయా?

లేదు. ప్రయివేటు కళాశాలల్లో కల్పించే సౌకర్యాలను బట్టి ఫీజులు నిర్ణయించుకునే అధికారం ప్రయివేట్ కళాశాలలకు ఇవ్వడం జరిగింది. ఫీజుల నియంత్రణపై ప్రభుత్వ పరంగా ఎలాంటి గైడ్లెన్స్ ఇవ్వలేదు. పుస్తకాలు, యూనిఫారం అమ్మితే నా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాను.

ప్రశ్న : ప్రభుత్వ కళాశాలలో ఎంతమంది అధ్యాపకులు ఉన్నారు? వారిలో రెగ్యులర్ ఎంత మంది? కాంట్రాక్టు ఎంత మంది? అధ్యాపకుల కొరత ఉందా?

జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 200 మంది అధ్యాపకులు ఉండగా వారిలో వంద మంది వరకూ కాంట్రాక్టు అధ్యాపకులు ఉన్నారు. ఎలాంటి అధ్యాపకుల కొరతా లేదు. ఎక్కడైనా అవసరం ఉంటే గెస్ట్ లెక్చరర్లను నియమించుకునే అవకాశం ఉంది.

ప్రశ్న : జిల్లాలోని 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అన్నింటికీ సొంత భవనాలు ఉన్నాయా? కొత్త భవనాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారా?

జిల్లాలో అన్ని కళాశాలలకూ సొంత భవనాలు ఉన్నాయి. టాయిలెట్, వాడుక నీటి సౌకర్యం ఉంది. అయితే నారాయణపురం కళాశాల బిల్డింగ్ పాతది కావడంతో ప్రస్తుతం డిగ్రీ కళాశాల భవనాన్ని ఉపయోగించుకోవడం జరుగుతుంది. కొత్త భవనానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మంజూరు కావాల్సి ఉంది.

ప్రశ్న : ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులను జెఇఇ మెయిన్స్, అడ్వాన్స్, నీట్ వంటి పరీక్షలకు సన్నద్ధం చేయడం లేదు. మెడిసిన్, ఎన్ఐటి, ఐఐటి, ట్రిబుల్ ఐటి సీట్లు సాధించిన వారిలో ప్రభుత్వ కళాశాల విద్యార్థులు కనిపించడం లేదు. ఆ దిశగా చర్యలు తీసుకునే అవకాశం ఉందా?

ఈ సంవత్సరం విద్యాశక్తి పథకం ద్వారా ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆన్‌లైన్లో విద్యార్థులకు ఈ పరీక్షలకు కోచింగ్ ఇస్తాం. అందుకోసం మెటీరియల్ కూడా వారికి అందించాం. వచ్చే సంవత్సరానికి మరింత విస్తరించే అవకాశం ఉంది.

'మెగా పేరెంట్స్ మీట్'కు పటిష్ట ఏర్పాట్లు

విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రముఖులు హాజరయ్యేలా చర్యలు

కలెక్టర్ కె. వెట్రిసెల్వి



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న 'మెగా పేరెంట్స్ మీట్'కు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో 'మెగా పేరెంట్స్ మీట్' కార్యక్రమం ఏర్పాట్లపై ఆదివారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1810 ప్రభుత్వ, 558 ప్రయివేటు పాఠశాలలు ఉన్నాయని, మొత్తం 2,368 పాఠశాలల్లోనూ, 140 జూనియర్ కళాశాలల్లోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. ఆ రోజు జరగనున్న కార్యక్రమాలపై ఇన్విటేషన్ రూపొందించి విద్యార్థుల తల్లిదండ్రులకు, ప్రముఖులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి విద్యార్థులందరూ యూనిఫామ్‌తో వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఆహ్లాదకరమైన వాతావరణంలో 'మెగా పేరెంట్స్ మీట్' జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రముఖులు పెద్దఎత్తున హాజరయ్యే అవకాశం ఉన్నందున, వారికి భోజన సదుపాయాల్లో ఎటువంటి సమస్యలు లేకుండా జాగ్రత్తగా వహించాలన్నారు. పాఠశాల వంటగదిలో అగ్నిప్రమాదాలు చోటుచేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలని, అగ్నిమాపక సిబ్బంది సహకారం తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులచే పాఠశాల ఆవరణలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం అటవీ శాఖ అధికారులు లక్షా 64 వేల 170 మొక్కలను సిద్ధం చేశారని, పాఠశాలలకు అవసరమైన మొక్కలు దగ్గరలోని అటవీశాఖ నర్సరీ ద్వారా పొందాలని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు వైద్య పరీక్షలు వెంటనే పూర్తిచేసి, కార్యక్రమం రోజున విద్యార్థుల ఆరోగ్య నివేదికను అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని కలెక్టర్ ఆదేశించారు. 'మెగా పేరెంట్స్ మీట్' కార్యక్రమం ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమం ఏర్పాట్ల పనులు, 10వ తేదీన 'మెగా పేరెంట్స్ మీట్' కార్యక్రమం నిర్వహణను ఎల్ఇఎపి యాప్'లో పొందుపర్చాలన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో 1,840 ప్రభుత్వ పాఠశాలల్లోని లక్షా 54 వేల 113 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించామని, జూనియర్ కళాశాలల విద్యార్థులకు రెండు రోజుల్లో ఆరోగ్య పరీక్ష పూర్తి చేస్తామని, వారందరికీ ఆరోగ్య పరీక్షా కార్డులను పంపిణీకి సిద్ధం చేస్తామని డిఎంహెచ్ఒ కలెక్టర్‌కు వివరించారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

9న సమ్మె జయప్రదానికి పిలుపు



ద్వారకాతిరుమలలో...



జీలుగుమిల్లిలో....

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల తొమ్మిదో తేదీన చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సిఐటియు మండల కార్యదర్శి ఆదికృష్ణ అధ్యక్షతన మండల ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వం నుంచి కార్మికులు సాధించుకున్న 29 కార్మిక అనుకూల చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్మికులకు ఉరితాడు బిగించారన్నారు. వీటికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అన్ని తరగతుల ప్రజలు సమ్మెకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, సిఐటియు మండల నాయకులు ధనలక్ష్మి, అనంతలక్ష్మి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల తొమ్మిదో తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.కొండలరావు పిలుపునిచ్చారు. ఆదివారం లక్ష్మీపురం జై భీమ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 9వ తేదీన జరగనున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రెసిడెంట్ బి.వెంకటరమణ, పోగుల నాగేశ్వరరావు, కాంతారావు, చేతుకూరి చిన్న, రమేష్, యేసు, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 6,325 కేసులు పరిష్కారం

ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి

ఏలూరు అర్బన్ :ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల ఐదో తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు జిల్లావ్యాప్తంగా 35 బెంచీలు ఏర్పాటు చేసి శనివారం రాత్రి వరకు జిల్లా వ్యాప్తంగా 6,325 కేసులను పరిష్కరించినట్లు ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో 20 ఏళ్ల నుంచి పెండింగ్ ఉన్న కేసును రాజీ చేసినట్లు తెలిపారు. కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, పోలీస్ అధికారులకు, రెవెన్యూ సిబ్బందికి, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ ప్రతినిధులకు, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ వారికి, జిల్లా పంచాయతీ శాఖ వారికి, పత్రిక విలేకరులకు, రవాణాశాఖాధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖ అధికారులకు, అడ్వకేట్ గుమస్తాలకు, అగ్రికల్చరల్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రమజీవులకు అండ ఎర్రజెండా

వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న మోడీ

సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యురాలు వనజ



ప్రతినిధుల సభలో మాట్లాడుతున్న అక్కినేని వనజ

ప్రజాశక్తి - చింతలపూడి

శ్రమజీవుల పక్షాన పోరాడేది ఎర్రజెండా మాత్రమే అని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. సిపిఐ జిల్లా ద్వితీయ మహాసభలో భాగంగా రెండో రోజు ఆదివారం రాధా గార్డెన్స్‌లో ఉన్న కారుమూడి సత్యనారాయణరెడ్డి ప్రాంగణంలో బత్తుల వెంకటేశ్వరరావు వేదికపై ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సభకు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు మామిళ్లపల్లి వసంతరావు స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన అక్కినేని వనజ మాట్లాడుతూ దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు రగిలిస్తూ, రాజ్యాంగంపై ఆర్ఎస్ఎస్ దాడి చేస్తుందని విమర్శించారు. వామప క్షాల ఐక్యతతో రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కెవి.ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి ఈ మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించి పని చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయ రాజకీయాలు రూపొందించాలంటే గ్రామస్థాయిలో స్థానిక సంస్థల్లో పట్టు సాధించాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య ప్రవేశపెట్టిన కార్యకలాపాల నివేదిక ప్రతినిధుల సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు పిచ్చయ్య, అలెగ్జాండర్, సరిపల్లి లెనిన్, ముల్లగిరి లాజర్ ఆలపించిన విప్లవ గేయాలు ఆకట్టుకున్నాయి. ఈ సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, బాడిశ రాము, సన్నేపల్లి సాయిబాబా, మైసాక్షి వెంకటాచారి, కారం దారయ్య, జెవి.రమణరాజు, రాష్ట్ర సమితి సభ్యులు ఎండి మునీర్, కలిశెట్టి వెంకట్రావు, రామవరం సర్పంచి పిట్టా ప్రసాద్, సిపిఐ చింతలపూడి మండల కార్యదర్శి తొర్లపాటి బాబు, మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి మన్నవ యామిని, సిపిఐ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

9 మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పిచ్చి కుక్క స్వైర విహారం చేయడంతో తొమ్మిది మందికి తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. తాటియాకులగూడెం, రామన్నపాలెం, జీలుగుమిల్లి ప్రధాన రహదారిపై ఆదివారం ఉదయం పిచ్చి కుక్క స్వైర విహారం చేస్తూ కంటికి కన్పించిన వారిని తీవ్రంగా గాయపర్చింది. గాయాలపాలైన వారిలో ఎక్కువ శాతం వృద్ధులు ఉండటంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పిచ్చి కుక్కను వెంబడించి హతమార్చడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. తొమ్మిది మందిని జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

క్షతగాత్రులకు ఎంఎల్ఎ బాలరాజు పరామర్శ

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న పిచ్చి కుక్క దాడిలో గాయాలపాలైన తొమ్మిది మందిని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పరామర్శించారు. వారు ఉదయం ఆసుపత్రిలో చేరితే సరైన వైద్యం అందించకుం డా సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఎంఎల్ఎ దృష్టికి వచ్చింది. ఆసుపత్రి సిబ్బంది వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి పునరావృతం కాకుండా ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. కుక్క దాడిలో గాయాలపాలైనవారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

రోషన్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు తగవు

ఎఎంసి మాజీ ఛైర్మన్ ముత్తారెడ్డి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌పై వచ్చే అసత్య ప్రచారాలు నిరూపిస్తే శాశ్వతంగా రాజకీయ నుంచి తప్పుకుంటామని చింతలపూడి ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి తెలిపారు. ఎఎంసి వద్ద ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇసుక, మట్టి దందాలు ఎవరు చేశారో నిరూపించాలన్నారు. అసత్య ఆరోపణలు చేస్తే చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బోడ నాగ భూషణం మాట్లాడుతూ ఇష్టానుసారంగా ప్రచారం చేస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ ప్రెసిడెంట్ తాటి అప్పారావు, లింగపాలెం మండలాధ్యక్షులు చలపతిరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ దేవ, మాజీ ఎంపిటిసి రాజా, సత్తిబాబు, గఫూర్, శేషగిరిరావు, రమేష్, తాటి సింహ, ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పత్రాలు సక్రమంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని ఆటో ఓనర్లు, డ్రైవర్లు తమ వాహనాలకు సంబంధించి తప్పనిసరిగా పత్రాలు సమర్పించాలని, నకిలీ వివరాలు అందించిన చట్టపరమైన చర్యలు తప్పవని ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆటో యజమానులు తమ వాహనాలకు సంబంధించి రిజిస్ట్రేషన్, పర్మిట్, ఫిట్‌నెస్, పొల్యూషన్ వంటి ధ్రువీకరణ పత్రాలు ప్రభుత్వ పరంగా చెల్లుబాటు అయ్యేవిధంగా ఫోర్స్‌లో ఉండాలని చెప్పారు. ప్రజల భద్రత, సరైన రవాణా వ్యవస్థ నిర్వహణ, ట్రాఫిక్ నియమాల అమలు కోసం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్‌రామ్

ప్రజాశక్తి - చింతలపూడి

బాబూ జగ్జీవన్‌రామ్ బీహార్‌లోని వెనుకబడిన తరగతుల నుంచి వచ్చిన స్వాతంత్ర సమరయోధుడని, సంఘ సంస్కర్త, 40 ఏళ్ల పాటు భారత పార్లమెంట్‌లో వివిధ పదవి బాధ్యతలు నిర్వహించడమే కాకుండా ఉప ప్రధానిగా కూడా వ్యవహరించారని టిడిపి చింతలపూడి పట్టణ అధ్యక్షులు తాటి అప్పారావు, జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు అన్నారు. మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఫైర్ స్టేషన్ సెంటర్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కనమతరెడ్డి రాజారెడ్డి, కొత్తపల్లి శేషగిరిరావు, తిరిమిల్లి రామారావు, దూడిగం మోహనరావు, మన్యం సత్యకుమార్, నత్తా రవి, సొంగా ఏసుపాదం, కందర్ల అబ్రహం, షేక్ సుభాని, దొడ్డిగార్ల ప్రకాశ్, బూసి రమేష్, పుప్పాల సుబ్బారావు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : ఏలూరు ఎస్‌సి, ఎస్‌టి బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ 39వ వర్ధంతి కార్యక్రమాన్ని మేడా అశోక్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, తదితర పెద్దలు పాల్గొన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దాసరి ఆంజనేయులు, ఆశయ్ బాబు, జుజ్జువరపు ప్రతాప్, లంకపల్లి మాణిక్యాలరావు, కాశీ కృష్ణ, చొటుపల్లి శ్రీనివాసరావు, పెద్దాడ రమణ, యనమల వెంకటేశ్వరావు, అన్నవరపు వెంకటేశ్వరావు, నల్లమిల్లి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం నేటి యువతరానికి ఆదర్శమని నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి బాబి అన్నారు. మండల కేంద్రమైన ముసునూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

వైసిపి పట్టణ అధ్యక్షునిగా గవరయ్య

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వైసిపి జంగారెడ్డిగూడెం పట్టణ అధ్యక్షుడిగా కర్పూరం గవరయ్య గుప్త ప్రమాణస్వీకార కార్యక్రమం ఆ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు చిటికెల అయ్యతరామయ్య అధ్యక్షతన నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, మడివిపట్నం పరిశీలకులు జెట్టి గురునాథరావు, పోల్నాటి బాబ్జి, జెడ్‌పిటిసి సభ్యులు బివిఆర్.చౌదరి, మండలపెద్ది సొంబాబు, మేడవరపు విద్యాసాగర్, వైస్ ఛైర్మన్లు కందర్ల వాసవి, ముప్పిడి వీరాంజనేయులు, ఒంగుంటి నాగేంద్ర, చింత అనిల్ గౌడ్, ముప్పిడి శ్రీను, షేక్ అక్బర్, కొన్నిలర్లు అయినాల వెంకటరమణమూర్తి, ఎల్‌వికర్ నెకూరి కిషోర్, ఉగ్గం దుర్గాప్రసాద్, కనుమూరి లావణ్య, కందర్ల గీత, తదికే మల్లు మురళి, కో-ఆప్షన్ సభ్యులు వెంప ఐజి, ఎందమన్న వెంకటేశ్వరావు, చలమాల శ్రీను, బత్తిన చిన్న సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా గుప్త మాట్లాడుతూ నాయకులకు, కార్యకర్తలకు అందరికీ అందుబాటులో ఉంటానని, పార్టీ ఆదేశాలు అనుసరిస్తూ ముందుకు వెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అర్య వైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీగా బాబ్జి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వైసిపి రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీగా జంగారెడ్డిగూడెం జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి నియమితులయ్యారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ తనకు రాష్ట్రస్థాయిలో ఈ పదవి అప్పగించినందుకు పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డికి, సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం నిత్యం శ్రమ పడతానని చెప్పారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా ఆటో యజమానులు తమ వాహనాలను నడపాలని, లేకపోతే వారిపై కేసులు నమోదు చేస్తామని ఏలూరు ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆటో డ్రైవర్, ఆటో యజమానులు రిజిస్ట్రేషన్ పత్రాలను వారి వెంట ఉంచుకోవాలని, అంతేకాకుండా ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ కూడా వారి వెంట ఉంచుకోవాలని తెలిపారు. లేకపోతే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

పెదలంకలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని పెదలంక వెలమపేటలో ఆదివారం టిడిపి నేతలు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలన, అభివృద్ధిపై కరపత్రాలను పంపిణీ చేస్తూ టిడిపి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాసరావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస చక్రవర్తి, నాయకులు అక్కల వెంకటరావు, కొక్కిలిగడ్డ ఆంజనేయులు, దున్న భోగేశ్వరరావు, కొల్లాటి సత్యనారాయణ, ఒడుగు గోపాలం, దుగ్గిరాల పరమేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్యుని జయంతి

ప్రజాశక్తి - కలిదిండి

ఏకలవ్యుని జయంతి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని ఆయన విగ్రహానికి ఏకలవ్య ఎరుకుల సంఘం అధ్యక్షుడు కుంభా నాగరాజు, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లంకా రత్నారావు, టిడిపి కలిదిండి గ్రామ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ అస్లాం, సంఘం నాయకులు, సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏకలవ్యుని జీవిత చరిత్రను నాయకులు వివరించారు. అనంతరం సంఘం ఏర్పాటు చేసిన కృషి చేయాలని కుంభా నాగరాజు అన్నారు.

పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలి

వర్ధంతి కార్యక్రమంలో ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయజెండా రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతి కార్యక్రమాన్ని నగరంలోని స్వాతంత్ర్యసమర యోధుల హాలులో ఘనంగా నిర్వహించారు. ఘంటసాల స్వరవేదం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పింగళి వెంకయ్య జీవిత చరిత్ర విశేషాలను ముఖ్యఅతిథిగా హాజరైన ఐరిషన్ విభాగం డిఇ దేవరకొండ వెంకటేశ్వర్లు, పింగళి అభిమాని, ఘంటసాల స్వరవేదం నిర్వాహకులు షేక్ బాబు సుభాని సందేశాలు ఇచ్చారు. పింగళి వెంకయ్యను స్మరించుకుంటూ ఆయనకు భారతరత్న ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బైలర్ బందారు శ్రీనివాస్, మెడికోండ పద్మజ, అనురాధ, సామాజికవేత్త చొటపల్లి విక్రమ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలపై కక్ష సాధింపేనా..!

గతంలోనే పోలీస్ స్టేషన్‌కు రెవెన్యూ కార్యాలయం వద్ద స్థలం కేటాయింపు

ఇప్పుడు పలు సాకులు చెబుతున్న వైనం

పోలీస్‌స్టేషన్ గ్రామంలోనే ఏర్పాటు చేయాలి

తరుగుమూల ఇళ్లస్థలాల లబ్ధిదారుల ఆవేదన

ప్రజాశక్తి - మండవల్లి


మండవల్లిలో పోలీస్‌స్టేషన్ నిర్మాణం రాజకీయ రంగు పులుముకుందా.. గతంలో స్టేషన్ నిర్మాణానికి స్థలం కేటాయిస్తే కావాలనే పేదల ఎండ స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మించాలని అనుకుంటున్నారా.. అందుకే రైల్వే గేటు ప్రయివేట్ స్థలం అనే కుంటి సాకులు చూపిస్తున్నారా.. అనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి. తొలుత అధికారులు సూచించిన స్థలంలో అందుబాటులో ఉండే విధంగా కిలోమీటర్ దూరంలో పోలీస్‌స్టేషన్ నిర్మించడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. మండల కేంద్ర పరిధిలో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు కోసం అప్పటి రైతులు విరాళాలు సేకరించి స్థలాలను కొనుగోలు చేసి ప్రభుత్వానికి అప్పగించారు. మాజీ సిఎం నందమూరి తారక రామారావు ప్రభుత్వ కార్యాలయాలన్ని ఒకేచోట ఉండాలనే లక్ష్యంతో ఆ భూమిని ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు చేసే విధంగా సుమారు 1983లో కేటాయించారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో రెవెన్యూ, ఎంపిడిఒ, వ్యవసాయ, పశుసంవర్ధక, విద్యాశాఖ, డ్వాక్రా, బిసి బాలుర వసతి గృహం, గృహ నిర్మాణ శాఖ, శిశు సంక్షేమ శాఖ, సచివాలయం, ఆర్‌బికె కార్యాలయాలను నిర్మించి సేవలందిస్తున్నారు. పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు గతంలో ఈ ప్రాంతంలోనే స్థలం కేటాయించారని, అదే ప్రాంతంలో పోలీస్ స్టేషన్ నిర్మించాలని ప్రజలు కోరుతుంటే ప్రయివేట్ స్థలంగా రికార్డుల్లో చూపిస్తుందని, రైల్వే గేటు ఉందని సాకులు చెప్పడం సమంజసం కాదని ప్రజలు అంటున్నారు. మండవల్లి నుంచి కలిదిండి, కోరుకొల్లు, ఆకివీడు, భీమవరం వెళ్లాలంటే రెండు మూడు గేట్లు, గుడివాడ, పెడన వెళ్లాలంటే ఒక్కొక్క రైల్వే గేట్లు ఉన్నాయని మరి వాటి పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో ప్రయివేట్ స్థలంగా చూపిస్తే ఆ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలను ఎలా నిర్మించారని అడుగు తున్నారు. పేదలపై ఉన్న కక్షతోనే కామన్ స్థలంలో పోలీస్ స్టేషన్ నిర్మించాలనే లక్ష్యంతో సాకును చెబుతున్నారంటున్నారు. అంతేకాకుండా గతంలోనే వ్యవ సాయ శాఖ కార్యాలయం వెనుక 25 సెంట్లు భూమిని పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించడంతో సర్వే చేయించి సరిహద్దులు నిర్ణయించి అప్పటి సిఐ అనుమతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారని, జిల్లా పోలీస్ అధికారులు కూడా ఆ స్థలాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారని సమాచారం. అయినప్పటికీ మండల కేంద్రానికి దూరాన సుమారు కిలోమీటర్ దూరంలో పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మించాలని పెద్దలు అనుకోవడం సరైన పద్ధతి కాదని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి రెవెన్యూ కార్యాలయం వద్ద కేటాయించిన స్థలంలో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, పట్టాలను పంపిణీ చేసి మెరక చేసి లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకునేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన స్థలం

పోలీస్ స్టేషన్ మండవల్లిలోనే నిర్మిస్తేనే బాగుంటుంది


బండి రంగారావు



మండవల్లిలోని రెవెన్యూ కార్యాలయం వద్ద పోలీస్ స్టేషన్ నిర్మిస్తే అందరికీ బాగుంటుంది. ఇప్పటికే ఎంపిడిఒ, తహశీల్దార్, పశుసంవర్ధక, శిశు సంక్షేమ శాఖ, హౌసింగ్ శాఖల కార్యాలయాలు అక్కడే ఉన్నాయి. వాటితో పాటు పోలీస్‌స్టేషన్ కూడా అక్కడ నిర్మిస్తే మరింత బాగుంటుంది. కిలోమీటర్ దూరంలో నిర్మించాలనుకోవడం సరికాదు.

పోలీస్ స్టేషన్ దూరంగా ఏర్పాటు చేయడం సరికాదు

చలమలశెట్టి ప్రసాద్



పోలీస్ స్టేషన్ ఊరికి కిలోమీటర్ దూరంలో నిర్మించాలనుకోవడం సరైన నిర్ణయం కాదు. పోలీస్ స్టేషన్ మొదట్లో హరిజనవాడలోని ఒక ఇంట్లో ఏర్పాటు చేశారు. అనంతరం జాతీయ రహదారి చెరువుగట్టుకు మధ్యలో బస్టాండ్ దగ్గర ఉన్న ఖాళీ స్థలంలో మండవల్లిలోనే ఏర్పాటు చేశారు. రహదారి విస్తరణలో తొలగించిన పోలీస్ స్టేషన్‌ను ఊరికి దూరంగా ఏర్పాటు చేయడం సరికాదు. మండవల్లిలోనే రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేస్తే అందరికీ బాగుంటుంది.

ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో చోరీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో కొనసాగుతున్న శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ హాస్టల్‌లో శనివారం అర్ధరాత్రి ఆగంతకులు చోరీ చేసినట్లు గుర్తించారు. ఇంజినీరింగ్ 3, 4 సంవత్సరాల విద్యార్థులు హాస్టల్‌కు వచ్చి పరిశీలించగా చోరీ సంఘటన వెలుగులోకి వచ్చింది. వేసవి సెలవులు కావడంతో ల్యాప్‌టాప్స్, దుస్తులు, కొన్ని పుస్తకాలు హాస్టల్లో వదిలివేశారు. తిరిగివచ్చి చూసేసరికి అవి చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలి

మాజీ ఎంఎల్ఎ ప్రతాప్‌అప్పారావు


ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ అంటూ చెప్పి అధికారం చేపట్టాక పక్కన పెట్టి ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలని నూజివీడు మాజీ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ అంశంపై నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడంలేదన్నారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని తెలిపారు.

శ్రీవారి ఆలయంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానం ఆధ్వర్యంలో హరిని కళ్యాణ మండపంలో మెగా మెడికల్ క్యాంపు ఆదివారం నిర్వహించారు. 200 మందికి డాక్టర్ పి.రితీష్, డాక్టర్ పి.తేజస్వి గుండె వైద్య సేవలందించారు. ఆలయ ఛైర్మన్ ఎస్‌వి.సుధాకరరావు, జాయింట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎన్‌విఎస్ఎన్.మూర్తి ఆదేశాల మేరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరు విజయ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు రితీష్, ప్రముఖ కంటి వైద్య నిపుణులు పి.తేజస్వి దేవాలయ సిబ్బంది 200 మందికి గుండె వైద్య పరీక్షలు, 160 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ ఇఒ భద్రయ్య మాట్లాడుతూ సమాజంలో ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రముఖ గుండె నిపుణులు పి.రితీష్ మాట్లాడుతూ 40 ఏళ్ల ప్రతి వ్యక్తి గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ మెగా మెడికల్ క్యాంపునకు డాక్టర్ ఆర్.రాజేంద్రప్రసాద్, ఎఇఒ రమణరాజు, ఎఇఒ నటరాజు, ఎఇఒ దుర్గారావు, సూపరింటెండెంట్లు గిరిజారాణి, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



పీకి పడేసిన గెడ్డర్లు

గెడ్డర్లను పీకేసిన దుండగులు

ఉంగుటూరు : నారాయణపురం కాలువ గట్టు మీదుగా భారీ వాహనాలు ప్రవేశించకుండా పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన ఐరన్ గెడ్డర్లును పీకిపడేశారు. శనివారం సాయంత్రం పంచాయతీ పాకలవర్గం, అధికారులు, పోలీసు ఆధ్వర్యంలో గెడ్డర్లు పాతించారు. అదే రోజు రాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గెడ్డర్లను భూమిలోంచి బయటకు తీసేసి రోడ్డు పక్కన వేసి పోయారు. ఆదివారం ఉదయం పంచాయతీ పంప్ ఆపరేటర్ చూస్తే విషయం తెలిసింది. ఎంతో వ్యవ ప్రయాసాలతో పంచాయతీ నిధులతో బిగించిన వాటిని పీకేయడంపై సర్పంచి అలకనంద పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నోటు పుస్తకాలు అందజేత

ఏలూరు సిటీ : మానూర్ ఎంపిపిఎస్ పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు త్యారా ప్రసాద్ అధ్యక్షతన గురు శ్రీ రెవరెండ్ ఫాదర్ బాలతజార్ రూ.ఐదు వేల విలువైన 200 నోట్‌బుక్స్‌ను ఆదివారం అందించారు. ఈ సందర్భంగా బాల తాజార్ మాట్లాడుతూ ప్రతి ఏడాది పిల్లలకు నూతన వస్త్రాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాటన్ గెస్పర్, మరి దాసు, దేవ సుందరం, బాలస్వామి ఫాదర్, బేతాళ మరిదాసు, కాటం ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొల్లేరు వాసులకు లీజు సొమ్ము చెల్లించాలి

లేకుంటే అబ్బయ్యచౌదరి ఇంటిని ముట్టడిస్తాం

కొల్లేరు సంఘ, టిడిపి కూటమి నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దెందులూరు మాజీ ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి కొల్లేరు చేపల చెరువుల తవ్వకాలకు సంబంధించి కొల్లేరు వాసుల నుంచి అక్రమంగా వసూలు చేసిన రూ.కోట్ల లీజు సొమ్ము తిరిగి చెల్లించే వరకూ అబ్బయ్య చౌదరిని వదిలే ప్రసక్తి లేదని కొల్లేరు సంఘ నాయకులు, టిడిపి కూటమి దెందులూరు నియోజకవర్గ నాయకులు హెచ్చరించారు. జిల్లా టిడిపి కార్యాలయంలో కొల్లేరు సంఘ నాయకులతో కలిసి టిడిపి కూటమి దెందులూరు నియోజకవర్గ నాయకులు ఆదివారం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొల్లేరు సంఘ నాయకులు సైదు సత్యనారాయణ, నేతల రవి, నంబూరి నాగరాజు, బొప్పన సుధాకర్ మాట్లాడుతూ ఈ నెల నాలుగో తేదీన దెందులూరు మాజీ ఎంఎల్ఎ తన స్వగ్రామమైన కొండలరావుపాలెంలో ఏర్పాటు చేసిన వైసిపి జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, తదితరులను అండగా చూసుకుని చింతమనేని ప్రభాకర్‌పై రెచ్చిపోయి మాట్లాడారన్నారు. కొల్లేరులో రూ.కోట్ల సొమ్ము లీజు వసూళ్లపై బహిరంగ చర్చకు రావాలని నాగరాజు అనే కూటమి నాయకుడు సవాల్ చేశాడు. నేతల రవి, సైదు సత్యనారాయణ, బొప్పన సుధాకర్ మాట్లాడుతూ మాజీ ఎంఎల్ఎ కొల్లేరులో లీజులు వసూలు చేయనప్పుడు కొంతమంది కూటమి నాయకులతో రాజీ చర్చలు ఎందుకు జరుపుతున్నారని ప్రశ్నించారు. మాజీ ఎంఎల్ఎ కొల్లేరు వాసులకు రూ.ఆరు కోట్లు చెల్లించేవరకు కొండలరావుపాలెంలో అబ్బయ్యచౌదరి ఇంటిని ముట్టడించి ధర్నాలు చేస్తూనే ఉంటామని, కొల్లేరు సంఘ నాయకులకు మద్దతుగా నిలిచి పోరాటం చేస్తామని కూటమి నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో మోత్కురి నాని, మాగంటి నారాయణ ప్రసాద్, దేవరపల్లి ఆదాము, ఈడ్పుగంటి అనిల్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

దండుదారి పుంత విస్తరణకు మోక్షం

పనులు ప్రారంభం

బండరాళ్లతో నేల పటిష్టం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం - తల్లాపురం ఒక కిలోమీటర్ పొడవైన పుంత రోడ్డును విస్తరించే పనులు ఆదివారం పున:ప్రారంభించారు. వంతెన లేకపోవడంలో ఈదారే అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. మొదట్లో కంకర పోసి చదును చేయగా వర్షాలు పడటంతో పనులు నిలిచిపోవటమే కాక వేసిన కంకర వల్ల నడవటానికి కూడా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో పుంత రోడ్డును అత్యవసరంగా అభివృద్ధి చేయాలని గ్రామస్తులు, వాహనాదారులు ఇలా అన్ని తరగతుల నుంచి ఒత్తిడి పెరిగింది. పుంత రోడ్డు విస్తరణ పనులు తిరిగి ప్రారంభించాల్సిందిగా ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు ఆదేశించారు. గతంలోనే నారాయణపురం - తల్లాపురం రూ.40 లక్షలు, పెద్దింట్లమ్మ ఆలయం నుంచి చేబ్రోలు పోలీసు స్టేషన్ వరకు రూ.49 లక్షలతో తారు రోడ్డుగా రెండు బిట్‌లకు కలిపి రూ.89 లక్షలు ఎంఎన్ఆర్ఇజిఎస్ గ్రాంట్లు ఆరు నెలల క్రితమే మంజూరయ్యాయి. వాటితో పనులు చేయాల్సిన తరుణంలోనే నారాయణపురం వంతెన మూసేయడంతో ఇక అత్యవసరంగా నిర్మాణ పనులు చేయాల్సి రావడంతో సిఆర్ అధికారుల పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. వాస్తవానికి ఈ పుంత మట్టి రోడ్డు డెల్టా నేల కావడంతో నేలను పటిష్టం చేయకపోతే బరువైన లారీ దిగబడి పోయే ప్రమాదం ఉంది. అందుకే పెద్ద పెద్ద క్వారీ కంకర రాళ్లను తెచ్చి 200 పొక్లెయినర్ యంత్రం సాయంతో 3.75 మీటర్ల వెడల్పు రోడ్డు వేసేలా నేలపై పరుస్తూ రోలింగ్ చేస్తున్నారు. ఇలా రోలింగ్ అయ్యాక దానిపై కంకర వేసి ప్రస్తుతానికి వాహనాల రాకపోకలు సాగించేలా యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తున్నామని పిఆర్ ఎఇ కృష్ణమోహన్ ప్రజాశక్తికి వివరించారు. తరువాత తారు రోడ్డును వేస్తామని చెప్పారు. కాగా ఆదివారం విస్తరణ పనులను క్షత్రియ కార్పొరేషన్ డెరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు పర్యవేక్షించారు. గుత్తేదారుడు శ్రీనివాసరాజు పనులు చేస్తున్నారు. కాగా కంకర బండలను తీసుకొచ్చే టిప్పర్లు మట్టి నేలలో కూరుకుపోతున్నాయి. వాటిని బయటకు తీసేందుకు పడరాని పాట్లు పడుతున్నామని గుత్తేదారుడు చెప్పారు.



దండుదారి పుంత విస్తరణ పనులు

పశు సంక్రమిత వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పశుసంక్రమిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి విద్య తెలిపారు. జీలుగుమిల్లి ప్రాంతీయ పశు వైద్యశాలలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు యాంటి రాబీస్ నివారణ టీకాలు ఆదివారం వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశు సంక్రమిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. పెంపుడు కుక్కల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాక్సిన్లు పశువైద్య శిబిరాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది ఎన్.రాజు, ఎహెచ్ఎలు ఫరీద్, కళ్యాణి, తేజ, శశి పాల్గొన్నారు.

మండవల్లి : పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు వేయించాలని, అప్పుడే ప్రాణాంతక వ్యాధులు మనుషులకు సంక్రమించకుండా ఉంటాయని పశు సంవర్ధక శాఖ ఎడి వరప్రసాద్ స్పష్టం చేశారు. జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల వల్ల మనుషులకు కొన్ని వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. కుక్కలకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. ఆదివారం 128 కుక్కలకు ర్యాబిస్ వ్యాధి టీకాలను వేసినట్లు తెలిపారు. మరో వారం పాటు వ్యాక్సిన్ వేస్తామని, కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని టీకాలు వేయించుకోవాలని ఆయన కోరారు.

భీమడోలు (ఉంగుటూరు) : పెంపుడు జంతువుల ఆరోగ్య పరిరక్షణకు పశుసంవర్ధక శాఖ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని, పూళ్ల సర్పంచి దాయం సుజాత కోరారు. పూళ్ల పశు వైద్యశాలలో పశు వైద్యులు జ్యోతి ఆధ్వర్యంలో జూనోసిస్ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని సర్పంచి ప్రారంభించారు. దీనిలో భాగంగా పశు వైద్యులు పూళ్లతో పాటు పరిసర గ్రామాలకు చెందిన శునకాలకు ఉచిత ర్యాబిస్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు దాయం ప్రసాద్ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో ప్రపంచ జోనోసిస్ దినోత్సవాన్ని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.రమేష్, ప్రాంతీయ బస్సు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. 126 పెంపుడు కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ముఖ్య అతిథిగా పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.రమేష్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి డాక్టర్ దినేష్, డాక్టర్ హరికృష్ణ, వెటర్నరి డాక్టర్ మహేంద్ర, అసిస్టెంట్ సర్జన్ యార్లగడ్డ శ్రీను, వెటర్నరి అసిస్టెంట్ ఎనమందల, గొల్లపల్లి ఏరియా పశుసంవర్ధక సహాయకులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'మానవత' కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పోలవరం

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ పోలవరం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం సంస్థ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలాధ్యక్షులుగా కోటమరాజు రామచంద్రరావు ఎన్నికయ్యారు. కమిటీ సభ్యుల మార్పులు జరిగాయి. అనంతరం కమిటీ సభ్యులు సమావేశమై భవిష్యత్ సేవా కార్యక్రమాలపై చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరచాలని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గోళ్ల చంద్రశేఖర్, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, సిద్ధా కృష్ణమూర్తి, ఎస్‌వి.నారాయణ, సోబ్బన మోహన్, ఆకుల నరసింహమూర్తి, భుక్యా అలివేలు, షెహిన్నా భాషా పాల్గొన్నారు.

దాతల పాత్ర కీలకం

ప్రజాశక్తి - భీమడోలు (ఉంగుటూరు)

ఉత్తమ సమాజ ఏర్పాటులో దాతల పాత్ర కీలకమని మానవత స్వచ్ఛంద సంస్థ జిల్లా శాఖ శాంతి రథాల ఛైర్మన్ అప్పక రాంబాబు తెలిపారు. భీమడోలు గ్రామానికి చెందిన దాతలు అమరా నాగేశ్వరరావు, తులసి దేవిల దంపతులు తమ కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థం రూ.75 వేల విలువైన శవాలు భద్రపరిచే శీతలీకరణ యంత్రాన్ని ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మండల శాఖ సభ్యులకు అందించారు. ఈ నేపథ్యంలో మండల శాఖ సభ్యులు దాతలను సత్కరించారు. ఈ సందర్భంగా మానవత మండల శాఖ అధ్యక్షులు అల్లాడ ప్రసాద్ మాట్లాడుతూ దాతల సహకారంతో తమ శాఖ వద్ద ప్రస్తుతం స్వీకరించిన శవాలు భద్రపరిచే శీతలీకరణ యంత్రాల సంఖ్య నాలుగుకు చేరిందన్నారు. సంఘ సభ్యులు, దాతల సహకారంతో శాఖ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ సభ్యులు గోనుగుంట రమణ శంకర్ పాల్గొన్నారు.